సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



మాకేది పరిహారం?

ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

వివరాలు 10లో ▸



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కేంద్రం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

వివరాలు 10లో ▸



ఎండలోనే వేచి..

ధర్మారం చౌరస్తాలో కనీసం బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

వివరాలు 11లో ▸

పామాయిల్ సాగు అంతంతే!

ఉమ్మడి మెదక్ జిల్లాలో తొలుత సిద్దిపేటలో సాగు

- ఇప్పటి వరకు 4,515 మంది రైతులు.. 15వేల ఎకరాల్లో సాగు
- గతేడాది 10వేల ఎకరాల లక్ష్యానికి సాగైంది 3వేలు మాత్రమే
- ఈ ఏడాదైనా సాగు పెంచేందుకు అధికారులు కృషి చేయాలి



సిద్దిపేటలో ఆయిల్ పామ్ తోట

సాక్షి, సిద్దిపేట: పామాయిల్‌ను అంతంత మాత్రంగానే సాగు చేస్తున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేకంగా సాగు చేస్తే వచ్చే లాభాలపై అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించి.. రైతులను అటు వైపు మళ్లించారు. ఏడాదిన్నర నుంచి అధికారులు , ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించకపోవడంతో పాటు నీటి ఇబ్బందులతో పామాయిల్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

15వేల ఎకరాల్లో సాగు..

తొలుత సిద్దిపేట జిల్లాలో రెండేళ్ల తర్వాత మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పామాయిల్ సాగును ప్రారంభించారు. ఉమ్మడి మెదక్‌లో 4,515 మంది రైతులు, 15,134 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మొక్కలను తెలంగాణ ఆయిల్ ఫెడ్, మెదక్, సంగారెడ్డిలలో ప్రైవేట్ కంపెనీలు అందజేస్తున్నాయి. గతేడాది ఉమ్మడి మెదక్ జిల్లాకు ఉద్యాన శాఖ 10వేల ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించగా 3,110 ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. ఇటీవల పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సందర్శించిన అనంతరం అధికారులతో సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగు తక్కువగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అధికారులు సమన్వయంతో సాగుతూ సాగు విస్తీర్ణం పెంచే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. గతంలో పామాయిల్ సాగుకు అధిక ప్రాధాన్యమిచ్చి పెద్ద రైతులను గుర్తించి వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారిని పామాయిల్ సాగు చేసే విధంగా ప్రోత్సహించారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఇక్కడే విక్రయించుకొనే అవకాశం

ఇప్పటికే సిద్దిపేటలో పామాయిల్ సాగవుతున్న పలు చోట్ల దిగుబడి ప్రారంభమైంది. గెలలు కోసి సిద్దిపేటలోనే విక్రయించి రైతులు ఆదాయం పొందారు. సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. త్వరలో అందుబాటులోకి రానుంది. దీంతో మార్కెటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను పామాయిల్ సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తే ఎంతో మేలు జరగనుంది.

ఎకరానికి రూ.50 వేల రాయితీ

రైతులను ప్రోత్సహించేందుకు పలు రకాల సబ్సిడీని అందిస్తోంది. ఎకరం ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం రూ. 50,600 రాయితీ ఇస్తున్నది. మొక్కలకు 80 శాతం సబ్సిడీ, అలాగే డ్రిప్ సిస్టమ్ కోసం బీసీలకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు. ఇలా 12.5ఎకరాల వరకు రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉంది. అలాగే మొక్కలు నాటిన నాలుగేండ్ల వరకు కాత రాదు. ఈ సమయంలో మొక్కల సంరక్షణతో పాటు ఆయిల్ పామ్ అంతర పంట సాగు కోసం ప్రభుత్వం రూ.4,200 చొప్పున నాలుగేండ్లకు రూ.16,800 చెల్లిస్తుంది. ఈ సాగుతో నాలుగేండ్ల తర్వాత నుంచి 30 ఏండ్ల వరకు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చు.

పామాయిల్ సాగు ఎకరాల్లో..

జిల్లా	2021-22	2022-23	2023-24	2024-25	మొత్తం
సిద్దిపేట	2,774	5,559	2,785	1,221	12,339
సంగారెడ్డి	---	---	570	1,350	1,920
మెదక్	---	---	336	539	875

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పామాయిల్ సాగు వైపు రైతులు వచ్చే విధంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. సంగారెడ్డి జిల్లాలో మొక్కల సరఫరాను ఓ ప్రైవేట్ కంపెనీ చేస్తోంది. ఆ కంపెనీ సిబ్బంది తక్కువగా ఉండటంతో లక్ష్యం చేరుకోలేకపోతున్నాం. ఈ సంవత్సరం అధికంగా సాగయ్యే విధంగా కృషి చేస్తాం.

– సోమేశ్వర్ రావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి, సంగారెడ్డి

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఏఐ బోధన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

మిరుదొడ్డి (దుబ్బాక): విద్యలో వెనుకబడిన విద్యార్థుల స్థాయి పెంపునకు ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ బోధన దోహద పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్, గణితంపై అసెస్మెంటన్లు ప్రాక్టీస్ చేయించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనంతోపాటు ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. అలాగే లింగుపల్లి ప్రాథమిక పాఠశాల, చెప్యాల ఉన్నత పాఠశాలను సందర్శించి డైట్ విద్యార్థుల ద్వారా థర్డ్ పార్టీ ఫిజికల్ వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్ బాబు, ప్రధానోపాధ్యాయుడు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు బాలకిషన్ , శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు



తూర్పార బట్టే యంత్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

బెజ్జంకి(సిద్దిపేట): వరి ధాన్యం విక్రయాల కోసం దళారులను ఆశ్రయించవద్దని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య రైతులకు సూచించారు. బెజ్జంకి ఏఎంసీ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తేమ, తాలు లేకుండా ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. వడ్లను తూర్పార బట్టే మిషన్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం కుడుతున్న యూనిఫామ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహ స్వామి ఆదాయం 4.80 లక్షలు



ఆలయంలో హుండీ తెరుస్తున్న అధికారులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ.4 లక్షల 80 వేల 276 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ తెలిపారు. ఎండోమెంట్ పరిశీలకురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం హుండీ తెరిచారు. మార్చి 23 తేదీ నుంచి నేటి వరకు హుండీలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ఆదాయంతో కలుపుకొని మొత్తం జాతర ఆదాయం రూ.14 లక్షల 9వేల 990 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ శర్మ, పూజారి మధుసూదనాచారి, ఏఎస్ఐ శంకర్‌రావు, డైరెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డయాలసిస్ సెంటర్‌కు బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు



సిబ్బందిని అభినందించి కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్

దుబ్బాక: ఉత్తమ సేవలు అందించినందుకు గాను దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్‌కు బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు లభించింది. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై దుబ్బాక కిడ్నీ సెంటర్‌కు అవార్డును అందించింది. 2023 మార్చ్ 5న దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో ఐదు బెడ్స్‌తో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైంది. దీంతో ఇప్పటివరకు ఈ సెంటర్లో 8200 డయాలసిస్ కేసులతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనే ఉత్తమ అవార్డు రావడం పట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్, డయాలసిస్ ఇన్‌చార్జ్ శేఖర్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే కక్ష సాధింపు

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయంగా ఎదుర్కోలేకే గాంధీ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ, ఆరపల్లె జంక్షన్ల అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీబీఐ, ఈడీలపై ఆధారపడి బీజేపీ సర్కార్‌ను నడుపుతోందన్నారు. బీజేపీ బలహీనపడే సందర్భంలో పార్లమెంట్‌లో, బయట నరేంద్రమోడీ జవాబు చెప్పలేక కాంగ్రెస్ నాయకత్వాన్ని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మిత్రపక్షాలు ఎంత అవినీతి చేసినా మాట్లాడకుండా ఉండి, ప్రత్యర్థులపై కక్ష సాధింపు ధోరణి మంచి పద్ధతి కాదన్నారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

క్రీడాకారులకు అభినందన..

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడల్లో రాణించి హుస్నాబాద్‌కు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.జిల్లా స్థాయి కబడ్డీ ట్రోఫీని గెలుపొందిన పోతారం(ఎస్) కృష్ణ కబడ్డీ క్లబ్ జట్టును గురువారం మంత్రి అభినందించారు. ఈ నెల 11, 12, 13న గజ్వేల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ట్రోఫీని పోతారం జట్టు గెలువడం హర్షణీయమన్నారు. గ్రామాల్లో క్రీడాకారులను తయారు చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాలని కోచ్ కృష్ణకు సూచించారు.

భూ హక్కులు భద్రం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, చిత్రంలో ఆర్డీఓ సదానందం, డీపీఓ దేవకీదేవి, తహసీల్దార్ సరిత, పీఏసీఎస్ చైర్మన్లు

- భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన
- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతితో భూమి హక్కులు భద్రంగా ఉండటంతో పాటు సమస్యల సత్వర పరిష్కారానికి మార్గం చూపుతాయని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై గురువారం నంగునూరులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ నూతన చట్టంలోని ఆరు అంశాలను సమగ్రంగా వివరించారు. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ అధికారుల విధులను తెలియజేశారు. తహసీల్దార్ జారీ చేసిన పట్టాపాసు పుస్తకాలు, భూధార్ అభ్యంతరాలపై ఆర్డీఓ, కలెక్టర్, భూమి ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సాదా బైనామాల పరిష్కారం, రైతులు లేవనెత్తిన సమస్యలకు సమాధానం ఇచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. వారసత్వ భూ సమస్యపై ఫిర్యాదు చేస్తే అధికారులు నోటీసులిచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తారని, అయినప్పటికీ పరిష్కరించకుంటే గతంలో ఇచ్చిన హక్కులు అమలవుతాయన్నారు. ప్రతి రైతుకు భూధార్ కార్డు అందజేస్తామని, చట్టం అమలుకు రెవెన్యూ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, డీపీఓ దేవకీదేవి, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్ప, పీఏసీఎస్ చైర్మన్లు రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చారిత్రాత్మక చట్టం భూ భారతి

సిద్దిపేటజోన్: భూ సమస్యలను పరిష్కరించేలా భూ భారతి లాంటి చారిత్రాత్మక చట్టాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విపంచి ఆడిటోరియంలో భూ భారతి చట్టం గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 17 నుంచి 30వరకు మండలాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీఓ సదానందం, తహసీల్దార్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు రాజకీయ, సామాజిక, విద్యా, క్రీడా రంగాల్లో రాణించేలా చిన్ననాటి నుంచే కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, కౌన్సిలర్ పూర్ణిమ, ఎల్లం యాదవ్, ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్. స్వాతిరెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న పి.చందన బదిలీ అయ్యారు. స్వాతిరెడ్డిని సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు, చందనను ఆరవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ ఆరవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. సంతోష్ కుమార్‌ను చందన స్థానంలో సిద్దిపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

బాలసదనంలో లీగల్ అవేర్‌నెస్



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతి రెడ్డి

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని బాలసదనంలో గురువారం లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతి రెడ్డి హాజరై పిల్లలకు చట్టాలు, చదువు విలువ గూర్చి వివరించారు. సమస్యలు ఉంటే 15100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బాలసదనంలో ఉన్న పిల్లల యోగ క్షేమాల గూర్చి ఆరా తీశారు. అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. భోజనం నాణ్యత, వంటగది, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె శిశు కేంద్రాన్ని సందర్శించారు.

5.33 గంటలు.. 40 కిలో మీటర్లు

మొక్కు చెల్లించడానికి పరుగెత్తారు


దుబ్బాకటౌన్: అనుకున్న లక్ష్యానికి, దైవ భక్తికి ఏ ఆటంకం ఎదురు రాదని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన కమ్మరి సాయి వర్ధన్, దుంపలపల్లికి చెందిన దొందడి రాకేశ్ నిరూపించారు. ఇటీవల భారత ఆర్మీ (అగ్నివీర్)కి సాయి వర్ధన్, రాకేశ్ ఎంపికయ్యారు. గురువారం ఇద్దరు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్నకు మొక్కు చెల్లించడానికి స్వగ్రామం నుంచి 40 కిలో మీటర్ల దూరాన్ని కేవలం 5 గంటల 33 నిమిషాల్లో పరుగెత్తి ఆలయాన్ని చేరుకున్నారు. కాగా సాయివర్ధన్ గతంలో ఆర్మీ సెలక్షన్‌లో రెండు సార్లు విఫలమయ్యాడు. దీంతో ఈసారి ఎంపిక కావాలని పట్టువదలని విక్రమార్కుడిలా రోజు ఉదయం గ్రౌండ్‌లో చెమటోడ్చి అనుకున్న లక్ష్యం సాధించాడు.



రాకేశ్, సాయి వర్ధన్

కొత్త దుమారం!

- ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిల్డర్లు డబ్బులిస్తామన్నారంటూ వ్యాఖ్యలు
- రాజకీయ దుమారం లేపిన కొత్త ప్రభాకర్‌రెడ్డి మాటలు
- తమ ప్రభుత్వ హయాంలోనూ దుబ్బాకకు నిధులు రాలేదంటూ ఆవేదన
- తన నియోజకవర్గాన్ని థీన్‌పత్త లెక్క చేశారని అసంతృప్తి
- చర్చనీయాంశంగా మారుతున్న దుబ్బాక ఎమ్మెల్యే తీరు



సీఎంతో కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు తమకు డబ్బులిస్తామంటున్నారన్న మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ''రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టాలంటూ బిల్డర్లు... పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు అవసరమైతే డబ్బులు కూడా ఇస్తామంటున్నారు..'' అంటూ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయవర్గాల్లో కలకలం రేపిన విషయం విదితమే. దీనిపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంటోంది. ముగ్గురు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నంప్రభాకర్, కొండా సురేఖ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టగా, తాజాగా ఎమ్మెల్యేపై స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రభాకర్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదురుతోంది.

జిల్లా విభజన తీరుపైనా అసంతృప్తి..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజన తీరును తప్పు బడుతూ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల చేసిన కీలక వ్యాఖ్యలు కూడా ఇప్పుడు తెరపైకి వచ్చాయి. వారం క్రితం దుబ్బాకలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ప్రభాకర్‌రెడ్డి... తమ నియోజకవర్గంలో కీలక రెవెన్యూ, పోలీసుశాఖల పరిధిని విభజించిన తీరు పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ''దుబ్బాక నియోజకవర్గం థీన్‌పత్త లెక్క తయారైంది..రెవెన్యూ డివిజన్ లేక అవస్థలు.. చేగుంట, నార్సింగి.. ఒకదిక్కయింది.. ఒక ఆర్డీఓ మెదక్‌లో ఉంటారు.. మరో ఆర్డీఓ తూప్రాన్ల.. ఒక్కో ఆర్డీఓ రామాయంపేటల.. ఎస్ఈలు ఒక చోట ఉంటే.. డీఈలు మరో జాగలో..'' అంటూ బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో జరిగిన ప్రభుత్వ శాఖల విభజన తీరుపై తనదైన శైలిలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి సెగలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.

తమ ప్రభుత్వంలోనూ నిధులు రాలేవంటూ..

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గానికి తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా నిధులు రాలేవని కూడా కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు గులాబీ పార్టీ శ్రేణులను ఇరకాటంలో పడేసినట్లయింది. ''దుబ్బాక నియోజకవర్గం ఎన్నో ఏళ్ల నుంచి వెనుకబడింది..ఇది వాస్తవం..ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా..గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా సరైన నిధులు రాలేదు.. ఇది జగమెరిగిన సత్యం..'' అని ప్రభాకర్‌రెడ్డి ఇటీవల కుండబద్దలు కొట్టారు.

తొలిసారి కలిసిన ఎమ్మెల్యేల్లో..

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన కొత్తలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, సునీతారెడ్డి, కొత్తప్రభాకర్‌రెడ్డిలు సీఎం వద్దకు వెళ్లారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎంతో భేటీ కావడంలో కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారనే చర్చ అప్పట్లో గులాబీ పార్టీలో జరిగింది. తర్వాత జరిగిన పరిణామాల్లో గూడెం మహిపాల్‌రెడ్డి గులాబీ పార్టీని వీడి.. కాంగ్రెస్ కండువా కప్పుకోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొత్తమ్మీద కొత్త ప్రభాకర్‌రెడ్డి తరచూ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో సరి'కొత్త' ఊహాగానాలకు తెరతీస్తున్నాయి. పది రోజుల్లో బీఆర్‌ఎస్ వ్యవస్థాపన దినోత్సవం నేపథ్యంలో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందో వేచి చూడాలి.

సీఎంను కలిసి అర్ధగంట మాట్లాడిన..

కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సంగతి తెలిసిందే. తాను అరగంటసేపు ఏం మాట్లాడాననే అంశంపై కూడా ప్రభాకర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే రేవంత్‌రెడ్డిని కలిశానన్నారు. ''రేవంత్‌రెడ్డిని కలిసి అర్ధగంట మాట్లాడిన..స్కిల్ యూనివర్సిటీ ఇస్తానని హామీ ఇచ్చారు.. వెంటనే సీఎంఓ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కూడా అడిగిన..ఈ రెండింటి కోసం 50 ఎకరాలు అవసరం పడుతుంది. పనిచేసిన వారిని గుర్తు చేసుకుంటాము..'' అని ప్రభాకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ప్రస్తావించారు. తనకు నియోజకవర్గం అభివృద్ధి ముఖ్యమని ఇందుకోసం కచ్చితంగా ఎవరి వద్దకైనా వెళ్తానని స్పష్టం చేశారు. ప్రభాకర్‌రెడ్డి సీఎంను కలిసిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో ప్రాధాన్యత తగ్గిందనే ప్రచారం గులాబీ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయడం గమనార్హం.

క్లుప్తంగా

పాము తెచ్చిన తంటా..

- నాలుగు గ్రామాలకు నిలిచిన కరెంట్



సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

కౌడిపల్లి(నర్సాపూర్): ఓ పాము సబ్‌స్టేషన్‌లోకి దూరింది. అంతటితో ఆగకుండా స్తంభాలపై నుంచి తీగలపైకి ఎక్కింది. విద్యుత్‌షాక్‌కు గురై చనిపోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో సబ్‌స్టేషన్‌లోని సీటీ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలింది. దీంతో కౌడిపల్లి 132/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కౌడిపల్లి, దేవులపల్లి, మహమ్మద్‌నగర్, ధర్మసాగర్ గ్రామాలకు కరెంట్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఏడీ రమణారెడ్డి, ఏఈ సాయికుమార్ విద్యుత్ సిబ్బంది పరిశీలించి రాత్రి వరకు మరమ్మతు చర్యలు చేపట్టారు.

100 ట్రిప్పుల ఇసుక సీజ్



విచారణ చేస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 100 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వేచరేణి శివారు వాగులో నుంచి కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి ఒక చోట డంప్ చేస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు వెళ్లి ఇసుక సీజ్ చేశామన్నారు. ఆయన వెంట ఆర్ఐలు రాజేందర్ రెడ్డి, ఐలయ్య, స్థానిక రైతులు ఉన్నారు.

విషపు ఆహారం తిని..

- మూడు ఆవులు మృతి

హత్నూర (సంగారెడ్డి): విష ఆహారం తిని మూడు పాడి ఆవులు మృతి చెందిన ఘటన హత్నూర మండలం గుండ్ల మాచునూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మన్నె సత్తయ్య పాడి గేదెలు, ఆవులను మేపుతూ జీవిస్తున్నాడు. గ్రామ శివారులో గల చెరువు సమీపంలో ఇటీవల సినీ ఇండస్ట్రీ వాళ్లు సినిమా షూటింగ్‌లో భాగంగా అమ్మవారికి అన్నం రతి పోసి నైవేద్యం సమర్పించే సన్నివేశాన్ని చిత్రీకరించారు. సుమారు 3 క్వింటాళ్ల బియ్యంతో వండిన అన్నం వదిలేసి వెళ్లిపోయారు. వారం రోజుల కిందట వండిన అన్నం కావడంతో పూర్తిగా కుళ్లిపోయింది. ఆ ఆహారాన్ని బుధవారం సాయంత్రం మూడు ఆవులు తిని మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగతనం కేసులో జైలు

మర్కూక్(గజ్వేల్): దొంగతనం కేసులో కోర్టు ఇద్దరికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు మర్కూక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. 2017 సెప్టెంబర్‌లో మర్కూక్ గ్రామానికి చెందిన తుప్పటి కొమురవ్వ వ్యవసాయ క్షేత్రం నుంచి ఇంటికి వెళ్తుంది. సంగారెడ్డి పట్టణానికి చెందిన అందనాగారం సాయిగౌడ్, బెండి రజనీకాంత్ ద్విచక్రవాహనంపై వచ్చి కొమురవ్వ మెడలో నుంచి రూ.60 వేలు విలువ చేసే బంగారు గొలుసును అపహరించారు. వెంటనే మర్కూక్ పోలీసులో ఫిర్యాదు చేశారు. గురువారం ఇద్దరు నిందితులను పట్టుకొని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక ఎదుట హాజరు పర్చగా సంవత్సరం జైలుతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

రామాయంపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన రామాయంపేటలోని బీసీ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న చర్చి ఫాదర్ మాసాయిపేట దయానంద్ 14న ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి ఊరికి వెళ్లాడు. 15న ఇంటి పక్కనే ఉంటున్న వ్యక్తి ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పాడు. దయానంద్ వెంటనే వచ్చి చూడగా ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో గురువారం రాత్రి పలు టీస్టాల్స్, పాన్‌షాపులు, హోటళ్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచనలతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. టీ స్టాల్స్ పాన్ షాపులు, హోటళ్లలో గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. డాగ్ స్క్వాడ్, క్యూఆర్టీ టీమ్‌తో తనిఖీలు చేశామన్నారు. ఎస్ఐ అమర్, ఆర్ఎస్ఐ భవానీ కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాకేది పరిహారం?



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు భైరి భిక్షపతి. గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసితుడు. ప్రాజెక్టులో ఊరు గుడాటిపల్లె మునిగి పోతే ముల్లె మూట సర్దుకొని హుస్నాబాద్‌కు వచ్చి కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. గాంధీనగర్‌లో మూడు ఎకరాలు సెలక కొని రూ.4 లక్షలు పెట్టి రెండు బోర్లు వేయించాడు. వానాకాలం బాగానే పంట వచ్చింది. ఈ యాసంగి వరి పెడితే ఒక బోరులో నీళ్లు లేక రెండు ఎకరాల వరి ఎండిపోయింది. బోరుకు తెచ్చిన బాకీలు రూ.2లక్షలు తీరకముందే రూ.60 వేల నష్టం వాటిల్లింది. గౌరవెల్లి ప్రాజెక్టుకు భూములు ఇచ్చి ఊరు విడిసిన గోదారి నీళ్లు రాకపాయే కరువు తప్పకపాదాయే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 3 వేల ఎకరాల్లో ఎండిన చేన్లు

- వట్టిపోయిన బోర్లు, చుక్క నీరు లేని బావులు
- వడగళ్లకు నష్టపోయిన పంటలకే ఇస్తే ఎలా?
- ఎండిన పంటలకు సైతం ఇవ్వాలని డిమాండ్
- గౌరవెల్లి ప్రాజెక్ట్ కింద మెట్ట రైతులను వీడని కరువు



పంట ఎండిపోవడంతో పశువులకు మేతగా వదిలేసిన రైతు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మెట్ట ప్రాంతం ఊట బావులు, బోర్ల నీటి లభ్యత మేరకు రైతులు పంటలు సాగు చేస్తారు. డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లో యాసంగి 68,272 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తే 53,280 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. వానా కాలం వర్షాలు సమృద్ధి కురిసినా భూగర్భజలాలు ఫిబ్రవరిలోనే అడుగంటిపోవడంతో రైతుల పంట చేన్లకు నీరు అందక ఎండిపోయాయి. వ్యవసాయ అధికారులు మార్చి 11 వరకు 593 ఎకరాల పంటలు ఎండిపోయినట్లు అంచనా వేశారు. మీర్జాపూర్ క్లస్టర్ పరిధిలోనే 600 ఎకరాల వరకు పంటలు ఎండిపోయినట్లు రైతులు చెబుతున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో సుమారు 6 వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయి. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులు నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసుకొని నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

పంట నష్ట పరిహారం ఏది?

వడగళ్లకు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. రూ.వేల కొద్ది పెట్టుబడులు పెట్టి నష్టపోయిన మాకు నష్టపరిహారం ఎందుకు ఇయ్యరని రైతులు ప్రశ్నిస్తున్నారు. సరైన సమయంలో రైతు బంధు ఇవ్వకపోతే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. పంటల బీమా లేకపోవడంతో నష్టపోయిన పరిహారం అందడం లేదు. బ్యాంకులు పంట రుణాలు ఇచ్చే సమయంలో పంట బీమా చేసినా ఏ రైతుకు ఇప్పటి వరకు పరిహారం ఇవ్వడం లేదని వాపోతున్నారు.

18 ఏళ్లుగా గోదావరి నీళ్ల ముచ్చటే!

మెట్ట ప్రాంత రైతులకు కరువు దూరం చేయాలని 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టుకు పునాదులు వేశాడు. అప్పటికే 90 శాతం పనులు పూర్తి చేసినా మహానేత మరణంతో ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి 8 టీఎంసీల వరకు 2020లో పనులు పూర్తి చేశారు. అధికారులు ముంపునకు గురైన గుడాటిపల్లె, తెనుగుపల్లె, కొత్తపల్లితో పాటు నాలుగు గిరిజన తండాలను ఖాళీ చేయించి 2023 జూన్ 30న గౌరవెల్లి ప్రాజెక్టులోకి ట్రయల్ రన్ చేసి గోదావరి నీళ్లు వస్తున్నాయని ఆశలు కల్పించారు. ఎన్జీటీలో కేసు ఉండటంతో పనులు నిలిపేయాలని స్టే ఇవ్వగా అధికారులు నిలిపేశారు. 2024 ఆగస్టులో ప్రాజెక్టు కుడి, ఎడుమ కాల్వల తవ్వకాల కోసం ప్రభుత్వం రూ.431 కోట్లు నిధులు మంజూరు చేయడంతో ప్రాజెక్టులోకి గోదావరి నీళ్లు వస్తాయని నాయకుల ప్రసంగాలతో రైతులకు భరోసా కల్పించారు. కాల్వల ద్వారా నీళ్లు రాకపోయినా ప్రాజెక్టులోకి గోదావరి నీళ్లు వస్తే బావుల్లో నీటి ఊటలు పెరుగుతాయని ఆశ పడ్డారు. 18 ఏళ్ల నుంచి గోదావరి నీళ్లు వస్తున్నాయనే నాయకుల మాటలే తప్ప ఇప్పటికీ నీళ్లు తీసుకరాలేదని రైతులు వాపోతున్నారు.

2 ఎకరాలు ఎండింది



వానాకాలం వరి కోతల వరకు వర్షాలు పడ్డాయని బావుల్లో నీళ్లు ఉంటే మూడు ఎకరాలు వరి వేసిన. ఉగాదికి ముందే ఊటలు వెనక్కి వెళ్లిపోవడంతో బాయి నీళ్లు అడుగంటిపోయి మొదటి మడి పారలేదు. వరుస తాళ్లు పెడితే ఒక ఎకరం పంట చేతుకి వచ్చింది. రెండు ఎకరాలు కళ్ల ముందే ఎండిపోతే పశువులకు మేతకు వదిలేసిన. రూ.45 వేలు పెట్టుబడి నష్టపోయిన ప్రభుత్వం మాకు పరిహారం ఇయ్యాలే.

– దేవేందర్ నాయక్, భల్లునాయక్ తండా

రూ.5 లక్షల వరకు నష్టం



గాంధీనగర్‌లో సొంత పొలంలో పశువులను పెంచి సేంద్రియ ఎరువు తయారుతోనే పంటలు సాగు చేస్తున్నా. ఎరువును ఇరుగు పొరుగు వారికి సరఫరా చేస్తా. 10 ఏళ్ల నుంచి ఎప్పుడూ చూడని కరువును ఇప్పుడు చూశా. రెండు బావులు, ఒక బోరు ఎండిపోతే రూ.1.50 లక్షలతో మరో 600 ఫీట్ల బోరు వేయించిన రూ.1.50 లక్షలతో మోటారు బిగిస్తే ఒక్క రోజులోనే ఎండిపోయింది. 3.20 ఎకరాల సేంద్రియ సన్న రకం వరి పంట ఎండిపోయింది. రూ.5 లక్షల వరకు నష్టం వచ్చింది. పశువుల మేతకు మరో దగ్గర నుంచి పశుగ్రాసం కొనుగోలు చేయాల్సి దుస్థితి వచ్చింది.

– మాదాడి రాజేశ్వర్‌రావు, గాంధీనగర్ హుస్నాబాద్

ఆర్ఈఏసీ సభ్యురాలిగా కౌడిపల్లి మహిళా రైతు

- కంచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి అరుదైన గౌరవం
- వ్యవసాయ పొలంలో సేంద్రియ పద్ధతిలో వరి, కూరగాయలు సాగు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) ఆర్ఈఏసీ (రిసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కౌన్సిల్) సభ్యురాలిగా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు నాయిని లక్ష్మీ ఎంపిక అయ్యారు. గురువారం విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శోభ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని పీజేటీఏయూలో గురువారం ఆర్ఈఏసీ సమావేశం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు రైతులు ఎంపిక కాగా ఇందులో లక్ష్మీని ప్రభుత్వం ఎంపిక చేసిందని రెండేళ్లపాటు సభ్యురాలిగా కొనసాగుతుందన్నారు. లక్ష్మీ కంచన్‌పల్లిలోని తన వ్యవసాయ పొలంలో సేంద్రియ పద్ధతిలో వరి, కూరగాయలతోపాటు అదనపు ఆదాయం కోసం ఒరంగట్టుపై టేకు మొక్కలు పెంపకం, కోళ్లఫారమ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ఇచ్చిన మిని కిట్స్‌తో విత్తన వరిని సైతం సాగు చేస్తుందన్నారు. ఆర్ఈఏసీ సమావేశంలో రైతులకు అందుబాటులో ఉండేలా నర్సాపూర్‌లో విత్తన గోదాం, టింబర్ గోదాం నిర్మించాలని సూచించినట్లు తెలిపారు.



లక్ష్మీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

రూ.లక్ష నగదు, విలువైన వస్తువులు కాలి బూడిద

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమై ఘటన అక్కన్నపేట మండలం పంతులీతండా గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన భానోతు పకాలియా–సారవ్వ కుటుంబ సభ్యులు గురువారం వ్యవసాయ పొలం పనులు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ అయ్యి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఇరుగుపొరుగు వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మంటలార్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సగానికి పైగా వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇటీవల మహిళా సంఘం ద్వారా వచ్చిన డబ్బులు రూ.లక్ష ఇంట్లో దాచిపెట్టగా బుగ్గిపాలయ్యాయి.



రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అదే విధంగా ఫ్యాన్లు, గిన్నెలు, ఫ్రీజ్, కూలర్‌తో పాటు బియ్యం బస్తాలు దగ్ధమయ్యాయి. వాటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు రైనా నాయక్ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

రెండో పెళ్లికి అడ్డొస్తుందని..

- నాలుగు నెలల కూతురిని మంజీరానదిలో పడేసిన తల్లి
- అదృశ్యమైన చిన్నారి కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు, రిమాండ్

కొల్చారం(మెదక్): రెండో పెళ్లికి అడ్డుగా ఉందనే నెపంతో సొంత కూతురిని ఓ కసాయి తల్లి నదిలో పారేసిన హృదయ విదారకర ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఈ కేసులో తల్లితోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిలిపిచెడ్ మండలం టోక్యా తండాకు చెందిన గాయత్రీకి కొల్చారం మండలం సీతారంతండాకు చెందిన రమావత్ రాజుతో ఏడాదిన్నర కిందట వివాహమైంది. వీరికి నాలుగు నెలల కూతురు ఉంది. వీరి ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో గాయత్రీ నాలుగు నెలల కుమార్తెతో అదృశ్యమైంది. ఈ విషయంపై చిలిపిచెడ్ మండలం టోప్యా తండాకు చెందిన గాయత్రీ తండ్రి దీప్లా జనవరి 28న కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో తన కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు తల్లి గాయత్రీ ఆచూకీ లభించగా, నాలుగేళ్ల చిన్నారి కనిపించకపోవడంతో పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గాయత్రీనే రెండో పెళ్లి చేసుకోవడానికి కూతురు అడ్డుగా ఉందని మంజీరాలో పాపను పారేసి హత్య చేసినట్లు తేలింది. ఇందుకు తండ్రి దీప్లా, అత్త బూలి సహకరించారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మికుల సమస్యలపై మే 20 సమ్మె
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో ఆల్ ట్రేడ్స్ యూనియన్స్ నాయకులు ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టి, సామాన్యులపై భారం మోపుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు రూ.వేల కోట్ల రాయితీలు ఇస్తున్నారని ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆ పని చేయకపోగా, ఉన్న ఉద్యోగాలకు ముప్పు తెస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్జమర్రి మల్లేశం, జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ, కోరింకల మల్లేశం, సంతోష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నందం, వివిధ రంగాల కార్మికులు, ఆల్ ట్రేడ్స్ యూనియన్స్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్


ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయండి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, నర్సింలు

తూప్రాన్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని టీఎస్‌యూఈఈయూ –సీఐటీయూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏ.మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలను బట్టి వారికి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో కార్మికులకు హామీ ఇచ్చిన విషయంను గుర్తుచేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మెరుపు సమ్మెకు కూడా వెనుకాడమని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గూడల రవీంద్ర ప్రసాద్, సురేశ్, జీవన్, రాజిరెడ్డి, శ్రీను, సలీం, దుర్గయ్య, సిద్ది రాములు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): గొర్రెలు, మేకలను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సీరజ్‌కుమార్ ఇంచురే(21), మాఖన్ విశాల్‌సింగ్(22), రాహుల్, బాబు నలుగురూ గొర్రెలు, మేకలను అపహరించడమే లక్ష్యంగా ముఠాగా ఏర్పడ్డారు. గత నెల 24న దిల్‌సుఖ్‌నగర్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకున్నారు. అదే రోజు రాత్రి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో చీర్ల మల్లేశంకు చెందిన మేకల దొడ్డిలో 4 మేకలను అపహరించారు. కారులో వేసుకొని హైదరాబాద్‌లోని జియాగూడలో విక్రయించారు. రెండ్రోలకు 26న తొగుట సమీప రాంపూర్‌లో 4 గొర్రెలు అపహరించి విక్రయించారు. బాధితుడు చీర్ల మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం గౌరారం హోటల్ వద్ద అనుమానాస్పదంగా కన్పించిన ముఠాలోని ఇద్దరు సభ్యులు సీరజ్‌కుమార్ ఇంచురే, మాఖన్ విశాల్‌సింగ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా రెండు చోరీలు చేసింది తామే అని ఒప్పుకున్నారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. మిగితా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఇటీవల మండలంలోని రాజిపేట శ్రీ రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో చోరీ జరుగగా కేసు నమోదు చేశాం. సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టాం. గురువారం కౌడిపల్లి శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా మండలంలోని దేవులతండాకు చెందిన విస్లావత్ ప్రేమ్ అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆలయంలో రూ.2 వేలు నగదు, రోల్డ్‌గోల్డ్, వెండి అభరణాలు చోరీ చేయగా దీంతోపాటు శివ్వంపేట మండల కొత్తపేట్ ఎల్లమ్మగుడి, చండీలోని ఆలయం, నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని మల్లన్నగుడిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. పలు కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

తిరుపతికని వెళ్లి వ్యక్తి

జహీరాబాద్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన బల్లెపు సంగయ్య (34) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 1న జహీరాబాద్ నుంచి రైలులో వికారాబాద్ వెళ్లి అక్కడి నుంచి తిరుపతి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఇప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి వృద్ధుడు

మిరుదొడ్డి (దుబ్బాక): వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. గురువారం ఎస్సై బోయిని పరశురామ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వనం యాదయ్య(55) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక గ్రామంలో తిరుగుతుండేవాడు. 14న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధు మిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



యాదయ్య

గుండ్లపల్లిలో వ్యక్తి

శివ్వంపేట(నర్సాపూర్) : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధి గుండ్లపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కుల్ల మల్లేశం 16న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మల్లేశం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



మల్లేశం

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకెళ్తుండగా..

- ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి
- మరో నలుగురికి గాయాలు
- నిజాంపేట్ మండలంలో ఘటన



బోల్తా పడ్డ ట్రాక్టర్



గడ్డమీది అశోక్ (ఫైల్)

నారాయణఖేడ్: ఆరుగాలం కష్టపడి పండిన వరి ధాన్యాన్ని తానే ట్రాక్టర్ నడుపుతూ రైతు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తున్నాడు. కొద్దిదూరంలో కొనుగోలు కేంద్రం ఉందనగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో రైతు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజాంపేట్ మండలం శాఖాపూర్‌కు చెందిన గడ్డమీది అశోక్ (38) తన పొలంలో పండిన ధాన్యంను నిజాంపేటలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేశాడు. ట్రాక్టర్‌ను తోలుకుంటూ అశోక్ వస్తున్న క్రమంలో కొనుగోలు కేంద్రానికి కొద్ది దూరంలో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తున్న రైతు అశోక్ ట్రాక్టర్ స్టీరింగ్ కింద ఇరుక్కుపోయి మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న బీర్ల లక్ష్మయ్య, బీరయ్యకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. అశోక్ భార్య సవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆరూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మొరంగపల్లి రాజయ్య(79) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం సదాశివపేట పట్టణానికి టీవీఎస్ ఎక్సెల్ పై వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. ఆరూర్ శివారులోని ఎవరెస్ట్ పరిశ్రమ వద్దకు రాగానే వెనుక వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రాజయ్యను సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి


చిన్నశంకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని చందంపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన క్యాసారం ఎల్లయ్య కుమారుడు దాసు(32) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. గొర్రెలను మేపడానికి గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన దాసు చందంపేట గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద దాహం తీర్చుకునేందుకు వెళ్లాడు. బోరు బావి స్టార్టర్ బాక్స్ వద్ద కరెంట్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన రైతు విషయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



దాసు (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు

గజ్వేల్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అక్కారం గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన గొర్లకాడి దుర్గాప్రసాద్(26) బైక్‌పై ప్రజ్ఞాపూర్ నుంచి తీగుల్ వైపు వస్తున్నాడు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో దుర్గాప్రసాద్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడికి ఏడాది కిందట చేర్యాల ప్రాంతానికి చెందిన పుష్పతో వివాహం జరుగగా ప్రస్తుతం ఆమె 4 నెలల గర్భిణీ అని గ్రామస్తులు పేర్కొన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే దుర్గాప్రసాద్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



దుర్గాప్రసాద్ (ఫైల్)